వనం..మనం.. మనఊరి కోసం

RNI/APTEL/26/A3829



ప్రభ మనం

TELUGU DAILY

తెలుగు డైలీ

Gmail: prabhamanam@gmail.com



విలేకరులు కావలెను.

WANTED... WANTED...

ఆంధ్ర, తెలంగాణ నుండి వెలువడుతున్న తెలుగు జాతీయ దినపత్రిక ప్రభ మనం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సి ఇంచార్జిలు, సిసి ఇంఛార్జిలు మరియు మండల విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

ఎడిటర్: వి. లింగమూర్తి

9000367833, 8074937223



కర్నూలు : ఎడిటర్ - వడ్డే లింగమూర్తి | సంపుటి : 1 సంచిక : 118 | పేజీలు : 4 వెల రూ./-4 | email: prabhamanam@gmail.com | శనివారం 19-09-2026


# పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం

కోరలు చాస్తున్న పేదరికం




- పాకిస్థాన్‌లో ప్రమాదకర స్థాయికి చేరిన పేదరికం
- గడిచిన ఆరేళ్లలో 21.8శాతం నుంచి 28.9శాతానికి పెరిగిన వైనం
- పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లోనే ఎక్కువ ప్రభావం
- అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభాలే ప్రధాన కారణాలు
- వృద్ధి ఫలాలు సంపన్నులకే.. పేదలకు తప్పని కష్టాలు

దాయాది దేశం పాకిస్థాన్‌ను పేదరికం చుట్టుముడుతోంది. గడిచిన ఆరేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో - మిగతా 2 లో

# పశ్చిమాసియా యుద్ధంలో మునిగిన ప్రపంచం

హర్మూజ్, సూయజ్ వ్యాపారానికి పెను ముప్పు!



- హర్మూజ్ ద్వారా చమురు రవాణా రెండొంతులకు పునరుద్ధరణ
- రవాణా పూర్తిగా నిలిచిపోయిందనే వాదనలను కొట్టిపారేసిన అమెరికా
- జోర్డాన్‌లోని అమెరికా బేస్‌పై ఇరాన్ దాడి, ఇద్దరు యూఎస్ సైనికుల మృతి
- సూయజ్ కాలువను మూసివేయడానికి ఇరాన్ ప్రయత్నం?
- యుద్ధం కారణంగా విపరీతంగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటి చమురు రవాణా మార్గాలను ప్రమాదంలోకి - మిగతా 2 లో

## తెలంగాణకు కొత్త మెట్రో

ప్రాజెక్టులకు అనుమతులపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు



- తెలంగాణలో కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వలేదని కేంద్రం స్పష్టం
- రాజ్యసభలో ఎంపీ ప్రశ్నకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ రాతపూర్వక సమాధానం
- హైదరాబాద్ మెట్రో ఫేజ్-1కు రూ.1,204 కోట్లు ఇచ్చామని వెల్లడి
- ఏపీలో ఎలాంటి మెట్రో ప్రాజెక్టులు అమలులో లేవని స్పష్టీకరణ

తెలంగాణలో కొత్తగా ఎటువంటి మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. - మిగతా 2 లో

## తిరుమలకు భారీగా భక్తుల రాక

31 కంపార్ట్‌మెంట్లు ఫుల్



- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు పూర్తి
- శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం
- ఆదివారం రూ. 4.05 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం
- నిన్న శ్రీవారిని దర్శించుకున్న 90,956 మంది భక్తులు

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. గత కొన్ని - మిగతా 2 లో

# 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం

- సమస్యలకు చెక్ పెట్టేలా హైలెవల్ కమిటీ!
- ఛైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్
- ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా నియామకం
- భూ యజమానుల విజ్ఞప్తుల పరిశీలన
- క్షేత్రస్థాయి సమస్యలపై కమిటీ దృష్టి
- పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్న కమిటీ



2లో

## స్కైరూట్ విజయం వేళ రాహుల్ వయసుపై

# ప్రధాని మోదీ చురకలు

- ప్రైవేట్ రాకెట్ ప్రయోగించిన యువతను ప్రశంసించిన ప్రధాని మోదీ
- రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి పరోక్షంగా సెటైర్లు
- స్కైరూట్ బృందం సగటు వయసు 28 అని వెల్లడి
- తాను మాట్లాడుతోంది 56 ఏళ్ల యువకుడి గురించి కాదన్న ప్రధాని



2లో

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత్‌లో తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా

## ఉక్రెయిన్‌లో కార్గో నౌకపై దాడి

నలుగురు భారతీయులతో సహా పలువురు మృతి



- ఉక్రెయిన్‌లోని ఒడెస్సా సమీపంలో పౌర నౌకపై క్షిపణి దాడి
- ధాన్యం లోడుతో వెళుతున్న పౌర కార్గో నౌక లక్ష్యంగా దాడి
- దాడిలో మరో భారతీయుడికి తీవ్ర గాయాలు

ఉక్రెయిన్‌లోని ఒడెస్సా నౌకాశ్రయం సమీపంలో పెను విషాదం చోటుచేసుకుంది. - మిగతా 2 లో

## విద్యార్థులపై లాఠీచార్జ్ స్పందించిన రాహుల్ గాంధీ



- పరీక్షల్లో అక్రమాలపై ఢిల్లీలో విద్యార్థుల భారీ నిరసన
- పార్లమెంట్ వైపు వెళుతున్న ఆందోళనకారులపై పోలీసుల లాఠీచార్జ్
- విద్యార్థులపై దాడి అప్రజాస్వామికమని రాహుల్ గాంధీ తీవ్ర విమర్శ
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని నిరసనకారుల డిమాండ్

పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా పార్లమెంట్ ముట్టడికి యత్నించిన - మిగతా 2 లో

## దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం



- మంగళగిరిలో దశాబ్దాల ఇంటి స్థలాల సమస్యకు మంత్రి లోకేశ్ పరిష్కారం
- 'మన ఇల్లు -- మన లోకేశ్' కింద రెండో విడతలో 3 వేల మందికి పట్టాల పంపిణీ
- ఈ నెల 21, 22 తేదీల్లో లబ్ధిదారులకు పట్టాలు అందించనున్న మంత్రి
- నిషేధిత జాబితాలోని భూములకు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు జారీ
- సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములకు పేదలకు శాశ్వత హక్కులు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా నెలకొన్న జఠిలమైన భూ సమస్యకు రాష్ట్ర ఐటీ, - మిగతా 2 లో

## ఏపీలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

# ప్రైవేటీకరణ చేస్తున్నారా?

సీఎం చంద్రబాబు సమాధానం ఇదే!

- సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల ప్రైవేటీకరణ వార్తలు అవాస్తవమన్న చంద్రబాబు
- పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు అని వివరణ
- దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులకు సీఎం ఆదేశం
- ఉద్దేశపూర్వకంగా పిటిషన్లు వేసేవారిని గుర్తించాలని సూచన
- రాష్ట్రంలో 49% వర్షపాత లోటు.. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

2లో




రాష్ట్రంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన,

## పదో తరగతి ఫెయిల్ గ్రేస్ మార్కులతో పాసయ్యా



- చదువుతో పేదరికాన్ని జయించవచ్చన్న మంత్రి నారాయణ
- పదో తరగతి ఫెయిల్ అయినా పట్టుదలతో పైకొచ్చానని వెల్లడి
- నెల్లూరులో ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డుల ప్రదానం
- అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు పిలుపు

చదువుతో పేదరికాన్ని జయించవచ్చని, కష్టపడితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఏపీ - మిగతా 2 లో

మనం..మనం.. మనఊరి కోసం
RNI/APTEL/26/A3829
ప్రభ మనం
TELUGU DAILY తెలుగు డైలీ
Gmail: prabhamanam@gmail.com
శనివారం 19-09-2026

## పదో తరగతి ఫెయిల్ గ్రేస్ మార్కులతో పాసయ్యా

మొదటిపేజీ తరువాయి – పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం నెల్లూరు జిల్లాలో జరిగిన 'షైనింగ్ స్టార్ అవార్డ్స్ – 2026' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, మెడల్స్, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంత్రి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ తన జీవితంలోని ఆసక్తికర విషయాలను విద్యార్థులతో పంచుకున్నారు. తాను పదో తరగతి ఫెయిల్ అయ్యానని, ఆ తర్వాత గ్రేస్ మార్కులతో పాస్ అయినట్లు వెల్లడించారు. ఆ వైఫల్యమే తనలో పట్టుదలను పెంచిందని, మూడేళ్ల డిగ్రీలో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచి స్టాటిస్టిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించానని గుర్తుచేసుకున్నారు. కష్టపడి చదివితేనే లక్ష్యాలను చేరుకోగలరని విద్యార్థులకు సూచించారు. చదువు పూర్తయ్యాక వీఆర్సీలో రూ.40 జీతానికి పార్ట్‌టైం లెక్చరర్‌గా పనిచేశానని, ప్రభుత్వ అధ్యాపకుడిగా అవకాశం వచ్చినా రాజీనామా చేసి, ట్యూషన్లు చెబుతూ కష్టపడి ఈ స్థాయికి వచ్చానని వివరించారు. యువనేత నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని మంత్రి కొనియాడారు. ఈ మార్పులను, అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## తెలంగాణకు కొత్త మెట్రో

మొదటిపేజీ తరువాయి – సోమవారం రాజ్యసభలో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈ విషయాన్ని వెల్లడించారు. బీజేపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వక సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 26 నగరాల్లో 1,159 కిలోమీటర్ల మేర మెట్రో నెట్‌వర్క్ ఉందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్–1ను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో అమలు చేసిందని, ఈ ప్రాజెక్టుకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద కేంద్రం రూ.1,204 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. ఇదే క్రమంలో పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఎటువంటి మెట్రో ప్రాజెక్టులు అమలులో లేవని, అందువల్ల కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందించలేదని కూడా స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మెట్రో ఫేజ్–2 విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. శంషాబాద్ విమానాశ్రయం, ఐటీ హబ్స్, పాతబస్తీ మరియు శివారు ప్రాంతాలను కలుపుతూ పలు కారిడార్లలో విస్తరణ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలను (డీపీఆర్) కూడా ఇప్పటికే కేంద్రానికి సమర్పించింది. ప్రాజెక్టు వ్యయాన్ని చెరిసగం పంచుకోవడానికి లేదా అవసరమైతే పూర్తి వ్యయాన్ని భరించడానికైనా సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు మెట్రో విస్తరణ అత్యవసరమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కేంద్ర మంత్రులతో పలుమార్లు చర్చలు జరిపారు. అయితే, కేంద్ర ప్రభుత్వం తాజాగా చేసిన ప్రకటనతో కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన తుది అనుమతులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని స్పష్టమవుతోంది.c

## తిరుమలకు భారీగా భక్తుల రాక

మొదటిపేజీ తరువాయి – రోజులుగా కొనసాగుతున్న రద్దీ సోమవారం కూడా తీవ్రస్థాయిలో ఉంది. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని మొత్తం 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న ఆదివారం (జులై 19) ఒక్కరోజే 90,956 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారికి 33,046 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది. రద్దీకి అనుగుణంగా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆదివారం నాడు టీటీడీ మొత్తం 4.44 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించింది. అదేవిధంగా, 2.94 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసింది. యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వైద్య కేంద్రాల ద్వారా 3,708 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ వెల్లడించింది. భక్తుల రద్దీ కొనసాగుతున్నందున, యాత్రికులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్... స్పందించిన రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి – విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. ఇది అత్యంత అప్రజాస్వామికమని, భారతీయ సంప్రదాయానికి విరుద్ధమని ఆయన కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తరుణంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు, యువకులు ఢిల్లీ వేదికగా నిరసన చేపట్టారు. నీట్ వంటి పోటీ పరీక్షల్లో వరుసగా చోటుచేసుకుంటున్న పేపర్ లీకేజీలు, ఇతర అక్రమాలపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న తోపులాటతో ఉద్రిక్తత నెలకొనగా, ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేసి, టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. "ఢిల్లీ వీధుల్లో నిరసన తెలుపుతున్న వారు నేరస్థులు కాదు, తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులు. వారిపై బలప్రయోగం చేయడం తగదు" అని ఆయన హితవు పలికారు. దేశంలో 152 పేపర్ లీకేజీల వల్ల సుమారు 7.5 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిన్నా, ప్రభుత్వం మాత్రం బాధ్యులను కాపాడటానికే ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.ద

## ఉక్రెయిన్‌లో కార్గో నౌకపై దాడి



మొదటిపేజీ తరువాయి – ధాన్యంతో వెళుతున్న ఒక పౌర కార్గో నౌకపై క్షిపణి దాడి చేయడంతో, నలుగురు భారతీయులతో సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. నల్ల సముద్రంలో పౌర నౌకల భద్రతకు పొంచి ఉన్న ముప్పును ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. కాగా, ఈ క్షిపణి దాడి చేసింది రష్యానే అని ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. టర్కీకి చెందిన, గినియా–బిస్సావ్ పతాకంతో ప్రయాణిస్తున్న 'గోల్డెన్ లియో' అనే బల్క్ క్యారియర్ నౌక, జూలై 19న ఒడెస్సా పోర్టు నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ఈ దాడికి గురైంది. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 17 మంది సిబ్బంది ఉన్నారు. సహాయక బృందాలు కొందరిని రక్షించి ఒడెస్సాలోని ఆసుపత్రికి తరలించాయి. ఈ ఘటనలో ఉక్రెయిన్ పైలట్‌తో పాటు మరికొందరు మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నౌకలో మొత్తం ఐదుగురు భారతీయులు ఉన్నట్లు భారత విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. వారిలో నలుగురు దుర్మరణం పాలవ్వగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉక్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధితులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోంది. "ఉక్రెయిన్‌లోని తాజా పరిస్థితులను తమ బృందం నిశితంగా పర్యవేక్షిస్తోందని, బాధితులకు అండగా నిలిచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని విదేశాంగ శాఖ పేర్కొంది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వ్యక్తి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. "వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం, అమాయక పౌర సిబ్బంది ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం, నౌకాయానం మరియు వాణిజ్య స్వేచ్ఛకు ఆటంకం కలిగించడం అత్యంత విచారకరం. ఇలాంటి దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కావు" అని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

## దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం

మొదటిపేజీ తరువాయి – విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం చూపారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు యాజమాన్య హక్కులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా, 'మన ఇల్లు -- మన లోకేశ్' కార్యక్రమం కింద రెండో విడతలో సుమారు 3,000 కుటుంబాలకు ఈ నెల 21, 22 తేదీల్లో శాశ్వత పట్టాలు పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళగిరి నియోజకవర్గంలోని కొండవాలు, అటవీ, దేవాలయ భూముల్లో వేలాది కుటుంబాలు దశాబ్దాలుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నాయి. అయితే, ఆ స్థలాలపై వారికి ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ ఆస్తులను పిల్లలకు బదిలీ చేయాలన్నా, అత్యవసరానికి రుణం పొందాలన్నా వీలుకాని దుస్థితి నెలకొంది. ఎన్నికల ప్రచారంలో ఈ సమస్యను గుర్తించిన లోకేశ్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం, అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే తొలి విడతలో భాగంగా రత్నాల చెరువు, యర్రబాలెం, నీరుకొండ వంటి ప్రాంతాల్లో 3,002 మందికి సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములపై శాశ్వత హక్కులు కల్పించారు. ప్రస్తుతం రెండో విడతలో భాగంగా మంగళగిరి డీజీపీ కార్యాలయం సమీపంలోని సీకే కన్వెన్షన్ హాలులో పట్టాల పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ విడతలో అందించే పట్టాల మార్కెట్ విలువ కూడా సుమారు రూ.1,000 కోట్లు ఉంటుందని అంచనా.

**వివిధ కేటగిరీల కింద పట్టాల పంపిణీ:**

సెక్షన్ 22ఏ సమస్యకు పరిష్కారం: మంగళగిరి, నవులూరు గ్రామాల్లోని కొన్ని సర్వే నంబర్ల భూములు సెక్షన్ 22ఏ(1)(ఛ) కింద నిషేధిత ఆస్తుల జాబితాలో ఉండటంతో 1,622 నివాస గృహాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ నిషేధాన్ని తొలగిస్తూ, ఆర్డీవో ధ్రువీకరించిన 'ప్రాపర్టీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ల'ను మంత్రి లోకేశ్ లబ్ధిదారులకు అందజేయనున్నారు.

**స్టీల్ బ్రిడ్జ్ నిర్వాసితులకు పట్టాలు:** అమరావతిలో బకింగ్‌హామ్ కాలువపై స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణంతో నిర్వాసితులైన 81 మందికి పునరావాసం కింద ఆత్మకూరు లేఅవుట్‌లో ప్లాట్లను కేటాయించారు. వీరికి సంబంధించిన పట్టాలను కూడా ఈ కార్యక్రమంలో పంపిణీ చేయనున్నారు.

**+.నా.వీం.చీశీ.30 కింద క్రమబద్ధీకరణ:** 150 చదరపు గజాల లోపు విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరిస్తూ 906 పట్టాలను సిద్ధం చేశారు. వీటిలో తాడేపల్లి మండలానికి 630, మంగళగిరి మండలానికి 276 పట్టాలు ఉన్నాయి. మొత్తంమీద, దశాబ్దాలుగా కాగితాలపై హక్కుల్లేక అభద్రతాభావంతో జీవిస్తున్న వేలాది కుటుంబాలకు మంత్రి లోకేశ్ చొరవతో శాశ్వత భరోసా లభించనుంది.

## ఏపీలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రైవేటీకరణ చేస్తున్నారా?

మొదటిపేజీ తరువాయి – సులభతరమైన సేవలు అందించేందుకే 'రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు' (=ాఖ) ఏర్పాటు చేస్తున్నామని, దీనిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను స్థాపిస్తున్నాం. ఇది ఎంతమాత్రమూ ప్రైవేటీకరణ కాదు" అని తేల్చిచెప్పారు. డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగానే ఈ కేంద్రాలు పనిచేస్తాయని, వాటి పనివిధానాన్ని ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల వల్ల ఆ ప్రక్రియ ఎంత సులువుగా మారిందో, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా అదే విధంగా మారుతుందని ఆయన వివరించారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగానే ఈ కేంద్రాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. "వాస్తవాలను ప్రజలకు వివరించి, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేయాల్సిన బాధ్యత అధికారులదే. ఇక డాక్యుమెంట్ రైటర్లు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి ఉపాధికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తాం" అని భరోసా ఇచ్చారు.

**వివిధ అంశాలపై సీఎం కీలక ఆదేశాలు**

సమీక్షలో భాగంగా పలు ఇతర అంశాలపైనా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. 'దీపం–2.0' పథకం లబ్ధిదారులకు సబ్సిడీ చెల్లింపులను క్రమబద్ధంగా చేపట్టాలని, వీలైతే నిర్దిష్ట తేదీల్లో చెల్లింపులు చేసేలా చూడాలని సూచించారు. పౌరసరఫరాల, ఆర్థిక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి, సాంకేతిక అంశాలను పరిశీలించి దీనిని అమలు చేయాలన్నారు. అదేవిధంగా, కేవలం ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేయాలనే ఉద్దేశంతో ప్రజాప్రయోజనం లేని ఫిర్యాదులు చేసే 'లిటిగెంట్ పిటిషనర్ల'ను గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. "రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి 81 మందిని గుర్తించాం. ఒక్కొక్కరు సగటున 246 పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపాలి. ప్రజాప్రయోజనం ఉన్న పిటిషన్లను తప్పక పరిశీలించాలి, కానీ దురుద్దేశంతో వేసే వాటిని గుర్తించాలి" అని అన్నారు. ఆర్థికేతర ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ఆర్థికపరమైన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 49 శాతం వర్షపాత లోటు ఉందని, దీని ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ వ్యూహాలు అన్వేషించాలని సీఎం సూచించారు. రైతుల్లో అవగాహన కల్పించి, మెట్ట పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం

మొదటిపేజీ తరువాయి – ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో నిరుపేదల సంఖ్య ప్రమాదకర స్థాయిలో పెరిగిపోయింది. వరుస ఆర్థిక సంక్షోభాలు, అధిక ద్రవ్యోల్బణం, బలహీనమైన వృద్ధి రేటు వంటి కారణాలతో కుటుంబ ఆదాయాలు గణనీయంగా క్షీణించాయి. ఫలితంగా దేశ జనాభాలో దాదాపు 29 శాతం మంది పేదరిక రేఖకు దిగువన జీవిస్తున్నారని ఒక తాజా నివేదిక వెల్లడించింది. 2018–19లో 21.8 శాతంగా ఉన్న పేదరికం, 2024–25 నాటికి 28.9 శాతానికి చేరింది. అంటే కేవలం ఆరేళ్లలోనే పేదరికం 7 శాతం పెరిగింది. హౌస్‌హోల్డ్ ఇంటిగ్రేటెడ్ ఎకనామిక్ సర్వే (హెచ్‌ఐఈఎస్), పాకిస్థాన్ సోషల్ అండ్ లివింగ్ స్టాండర్డ్స్ మెజర్‌మెంట్ (పీఎస్‌ఎల్‌ఎం) డేటా ఆధారంగా 'డాన్' పత్రిక ఈ విశ్లేషణను ప్రచురించింది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత విడుదలైన ఈ గణాంకాలు.. దేశం ఎదుర్కొన్న బహుళ సంక్షోభాల ప్రభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. గ్రామీణ పాకిస్థాన్‌లో పేదరికం సుమారు 8 శాతం మేర పెరగగా, పట్టణ ప్రాంతాల్లో ఇది 6 శాతంగా నమోదైంది. పదేపదే తలెత్తిన చెల్లింపుల సంక్షోభం, కోవిడ్–19 మహమ్మారి, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, దీర్ఘకాలిక స్థూల ఆర్థిక సర్దుబాట్లు వంటివి ఈ దుస్థితికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. విశ్లేషకులు ఈ పరిస్థితిని జీవన ప్రమాణాల మెరుగుదల విషయంలో 'కోల్పోయిన దశాబ్దం'గా అభివర్ణిస్తున్నారు. గత రెండు సర్వేల మధ్య కాలంలో ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత చూస్తే, సగటు కుటుంబ ఆదాయాలు, వినియోగం గణనీయంగా తగ్గినట్లు నివేదిక పేర్కొంది. ఆర్థిక వృద్ధి సానుకూలంగా ఉన్నప్పటికీ, పేదరికం పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఈ వృద్ధి ఫలాలు ఎక్కువగా ఉన్నత ఆదాయ వర్గాలకే చేరాయని, దిగువ ఆదాయ వర్గాల వాస్తవ ఆదాయాలు, కొనుగోలు శక్తి తీవ్రంగా దెబ్బతిన్నాయని ఇది సూచిస్తోంది. పేద కుటుంబాలు ఎక్కువగా రోజువారీ వేతనాలపై ఆధారపడతాయి. అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక అంతరాయాల వల్ల ఈ వర్గాలే ఎక్కువగా నష్టపోయాయి. మరోవైపు, సంపన్న వర్గాలు రియల్ ఎస్టేట్, ఆర్థిక పెట్టుబడుల వంటి ఆస్తులను కలిగి ఉండటంతో, ధరల పెరుగుదల ప్రభావాన్ని తట్టుకోగలిగారు. దీంతో దేశంలో ఆదాయ అసమానతలు మరింత పెరిగాయి. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, బాహ్య ఆర్థికపరమైన రిస్కుల మధ్య, పెరుగుతున్న పేదరికాన్ని, విస్తరిస్తున్న అసమానతలను పరిష్కరిస్తూనే ఆర్థిక వృద్ధిని కొనసాగించడం పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు పెను సవాలుగా మారింది.

## స్కైరూట్ విజయం వేళ.. రాహుల్ వయసుపై ప్రధాని మోదీ చురకలు

మొదటిపేజీ తరువాయి – ప్రయోగించిన హైదరాబాద్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్'ను అభినందిస్తూనే, రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మీడియాతో మాట్లాడిన ప్రధాని, దేశం సాధించిన ఇటీవలి విజయాలను ప్రస్తావించారు. "భారత్ నుంచి తొలి ప్రైవేట్ రాకెట్‌ను ప్రయోగించిన స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లేనని నాకు తెలిసింది. ఇంతటి అతి పిన్న వయస్కులు ఈ ఘనతను సాధించారు. నేను ఇక్కడ 56 ఏళ్ల 'యువకుడి' గురించి మాట్లాడటం లేదు... రోదసిలో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన 28 ఏళ్ల యువత గురించి మాట్లాడుతున్నాను" అని మోదీ పేర్కొన్నారు. జూన్ మాసంలో 56వ ఏట అడుగుపెట్టిన రాహుల్ గాంధీని ఉద్దేశించే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ శనివారం 'విక్రమ్–1' రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ ప్రయోగం ద్వారా అమెరికా, చైనాల తర్వాత ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాలను కలిగిన మూడో దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం కొన్ని దేశాలకు మాత్రమే పరిమితమైన ఈ ఘనతను భారత యువత సాధించడం దేశానికే గర్వకారణమని మోదీ కొనియాడారు. గత ఏడాది వర్షాకాల సమావేశాల కంటే ముందు ఓ భారత పౌరుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న అంశాన్ని కూడా ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పార్లమెంట్ సమావేశాలు అర్థవంతంగా, ఫలప్రదంగా సాగాలని, ప్రజా సమస్యలపై లోతైన చర్చలు జరగాలని ఆయన ఆకాంక్షించారు.

## పశ్చిమాసియా యుద్ధంలో మునిగిన ప్రపంచం



మొదటిపేజీ తరువాయి – నెట్టేసింది. అమెరికా వైమానిక దాడులు, ఇరాన్ ప్రతీకార దాడుల నడుమ హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా ప్రస్తుతం యుద్ధానికి ముందు నాటితో పోలిస్తే సుమారు మూడింట రెండు వంతులకు చేరుకుందని ట్రంప్ ప్రభుత్వం తెలిపింది. అదే సమయంలో, ఇరాన్ ఈ ఘర్షణను మరింత విస్తృతం చేస్తూ సూయజ్ కాలువకు కూడా ముప్పు తలపెట్టే అవకాశం ఉందని నాటో మాజీ కమాండర్ హెచ్చరించారు. హర్మూజ్ జలసంధి ద్వారా రవాణా పూర్తిగా స్తంభించిపోయిందనే వార్తలను అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్ రైట్ తోసిపుచ్చారు. ప్రస్తుత సగటు ప్రకారం ఈ జలసంధి ద్వారా రోజుకు 70 మిలియన్ బారెళ్ల చమురు, బైపాస్ పైప్‌లైన్ల ద్వారా మరో 70 మిలియన్ బారెళ్ల చమురు సరఫరా అవుతోందని ఆయన వెల్లడించారు. గల్ఫ్ ప్రాంతం నుండి మొత్తం 140 మిలియన్ బారెళ్ల సరఫరా జరుగుతోందని, ఇది గత మార్చి నెలతో పోలిస్తే గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఓడల సంఖ్య తగ్గినప్పటికీ, ప్రపంచ మార్కెట్‌కు కొరత లేకుండా చూడటానికి పెద్ద ట్యాంకర్లను ఉపయోగిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ జరిపిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు మరణించగా, మరొకరు గల్లంతయ్యారు. దీనికి ప్రతికారంగా అమెరికా దళాలు ఇరాన్‌పై సరికొత్త దాడులు జరిపాయి. ఇరాన్ సహకారం ఉన్నా లేకపోయినా ఈ జలసంధి ద్వారా రవాణాకు రక్షణ కల్పిస్తామని అమెరికా పేర్కొంది. అయితే డెమొక్రాటిక్ సెనేటర్ మార్క్ వార్నర్ ఈ అంచనాలను తప్పుపట్టారు. యుద్ధం కారణంగా వర్జీనియాలో పెట్రోల్ ధర గాలన్‌కు 2.81 డాలర్ల నుండి 4 డాలర్లకు, డీజిల్ ధర 5 డాలర్లకు పెరిగిందని, ఈ యుద్ధం ఒక పెద్ద విపత్తు అని ఆయన విమర్శించారు. నాటో మాజీ సుప్రీం అలైడ్ కమాండర్, రిటైర్డ్ అడ్మిరల్ జేమ్స్ స్టావ్రిడిస్ ఇరాన్ తదుపరి వ్యూహంపై సంచలన హెచ్చరికలు చేశారు. హర్మూజ్ జలసంధి మాత్రమే కాకుండా, పశ్చిమ ప్రాంతంలో ఉన్న హౌతీ తిరుగుబాటుదారులను వాడుకుని సూయజ్ కాలువను మూసివేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తోందని అన్నారు. ఎర్రసముద్రం ఉత్తర సరిహద్దుకు సమీపంలో ఉన్న జోర్డాన్‌పై ఇటీవల జరిగిన దాడులకు, ఈ వ్యూహానికి సంబంధం ఉండవచ్చని ఆయన విశ్లేషించారు. ఇరాన్ కనుక సూయజ్ కాలువను అడ్డుకుంటే ప్రపంచ వాణిజ్యం కోలుకోలేని దెబ్బతింటుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం



తెలంగాణలో సెక్షన్ 22–ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22–ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది. ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

# మేక్‌మైట్రిప్ ప్రత్యేక ఆఫర్

ఇంటర్నేషనల్ టికెట్లపై విడుతలవారిగా చెల్లింపులు



రవాణా సదుపాయాలు సమకూరుస్తున్న మేక్‌మైట్రిప్..కస్టమర్లను ఆకట్టుకోవడానికి వినూత్న ఆఫర్‌ను తెరపైకి తీసుకొచ్చింది. అంతర్జాతీయ ప్రయాణికులను ఆకట్టుకోవడంలో భాగంగా తమ ముందస్తు విమాన టికెట్ బుకింగ్ చేసుకున్నవారు ఒకేసారి చెల్లింపులు జరుపాల్సిన అవసరం లేదని, విడతలవారీగా చెల్లిస్తే సరిపోతున్నదని వెల్లడించింది. ముందస్తు బుకింగ్ చేసుకున్న సమయంలో విమాన టికెట్ చార్జిలో 10 శాతం నుంచి 40 శాతం మధ్యలో చెల్లిస్తే సరిపోతున్నదని, మిగతాది ప్రయాణానికంటే ముందు లేదా బుకింగ్ చేసుకున్న నాటినుంచి 45 రోజులు ఏది ముందువస్తే ఆ రోజు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించింది. ఈ ఆఫర్‌ను ఎంచుకున్నవారు ఎలాంటి అదనపు చెల్లింపులు జరుపాల్సిన అవసరం లేదని పేర్కొంది. విమానయాన రంగంలో ఇలాంటి ఫీచర్ ప్రవేశపెట్టడం ఇదే తొలిసారని, ప్రయాణికులు తమ అంతర్జాతీయ రూట్లకోసం ఒకేసారి చెల్లింపులు జరుపాల్సి వస్తుండటంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వీరికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ స్కీంను ప్రవేశపెట్టినట్లు మేక్‌మైట్రిప్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి సౌజన్య శ్రీవాత్సవ తెలిపారు. ముఖ్యంగా అతిపెద్ద కుటుంబాలు లేదా గ్రూపులు తమ అంతర్జాతీయ బుకింగ్‌లపై ఒకేసారి మొత్తం చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ కొత్త స్కీంతో వీరికి ప్రయోజనాలు కలుగనున్నాయన్నారు. ఎక్కువ మంది భారతీయులను అంతర్జాతీయ విమానాల బుకింగ్ చేసుకునేందుకు వీలుగా ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ స్కీంనకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించిందని, ఒంటరిగా, జంటలు, కుటుంబాలు అంతర్జాతీయ రూట్లలో ప్రయాణించేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నదన్నారు.

# బిగ్ సి లో సంక్రాంతి ఆఫర్లు



సంక్రాంతి ఆఫర్లను ఆవిష్కరిస్తున్న బిగ్ 'సి' సంస్థ ఫౌండర్ మరియు సి.యం.డి. శ్రీ యం. బాలు చౌదరి

ప్రముఖ మొబైల్ రిటైల్ దిగ్గజం బిగ్"సి'.. సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని ఆకర్షణీయమైన ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా కంపెనీ ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి మాట్లాడుతూ.. ఈ సంక్రాంతి సందర్భంగా ప్రతి మొబైల్ కొనుగోలుపై రూ.10 వేల వరకు మొబైల్ ప్రొటెక్షన్‌తోపాటు రూ.5,999 విలువైన స్మార్ట్‌వాచ్, రూ.1,799 విలువైన ఎయిర్‌బడ్స్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఇటీవల మార్కెట్లోకి వచ్చిన ఒప్పో రెనో 13 మొబైల్ కొనుగోళ్లపై రూ.7,990 విలువ కలిగిన స్విస్ మిలిటరీ స్పీకర్‌తోపాటు ఏడాదిపాటు మొబైల్ ప్రొటెక్షన్, రూ.5 వేల వరకు ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్‌ను కూడా అందిస్తున్నట్లు చెప్పారు.

**స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.15 వేల వరకు తక్షణ క్యాష్ బ్యాక్**

**బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51 శాతం డిస్కౌంట్**

**వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండానే మొబైల్ కొనుగోలు అవకాశం**

**ఐఫోన్ మొబైల్‌పై రూ.5 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్**

**వివో-ఒప్పో మొబైళ్ల కొనుగోలుపై 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్**

**వన్‌ప్లస్, రియల్‌మీ మొబైళ్లపై రూ.3 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్**

**ఎంఐ మొబైళ్లపై రూ.5 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్**

**ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండా మొబైళ్లు, స్మార్ట్‌టీవీ, ల్యాప్‌టాప్, ఏసీలను కొనుగోలు చేయవచ్చును.**

# ఉన్నట్టుండి పెరిగిన బంగారం ధర సడన్ షాక్ ఇచ్చిందిగా



గతేడాది బంగారం ధరలు కాస్త తగ్గుతూ వచ్చాయి. దీంతో మహిళలతో పాటు గోల్డ్ లవర్స్ కొనుగోళ్లకు చాలా ఆసక్తి చూపించారు. కొత్త ఏడాది పసిడి మరింత దిగొస్తుందని భావించారు. కొని దాచుకోవాలని భావించారు. మ్యారేజ్ సీజన్ సమయంలో ధరలు కొండెక్కుతాయి కాబట్టి ఇప్పుడే కొనేస్తే బెటర్ అని భావించారు. కానీ పసిడి తగ్గేదేలే అంటూ పరుగులు పెడుతోంది. కొత్త సంవత్సరం ప్రారంభం నుంచి కూడా గోల్డ్ రేట్స్ భారీగా పెరుగుతూ వస్తున్నాయి. ఇవాళ కూడా ధరలు పెరిగాయి. ఉన్నట్టుండి ఒక్కసారిగా కొండెక్కింది గోల్డ్. ప్రస్తుతం బంగారం ధరలు ఎంత ఉన్నాయి? గోల్డ్ రేట్స్ పెరగడానికి గల కారణాలు ఏంటి? అనేది ఇప్పుడు మనం చూద్దాం..

## గోల్డ్ పైకి.. సిల్వర్ కిందకు..!

నాల్రోజుల తర్వాత గోల్డ్ రేట్స్ స్వల్పంగా పెరిగాయి. హైదరాబాద్‌లో జనవరి 9, గురువారం ఉదయం చూసుకుంటే.. 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.100 పెరిగి.. రూ.72 వేల 250 దగ్గరకు చేరింది. అదే 24 క్యారెట్ల స్వచ్ఛమైన పసిడి రేటు రూ.110 పెరిగి తులం రూ.78 వేల 820 పలుకుతోంది. తగ్గుతూ పోతున్న గోల్డ్ మళ్లీ ఊపందుకోవడానికి అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులే కారణమని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ఇక, బంగారం ధరలు పెరిగినా.. వెండి మాత్రం స్థిరంగా కొనసాగుతూ సిల్వర్ లవర్స్‌ను ఆకర్షిస్తోంది. ఇవాళ హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,00,000 వద్ద ట్రేడింగ్ అవుతోంది. పైన పేర్కొన్న పసిడి, వెండి ధరలు గురువారం పొద్దున 7 గంటల టైమ్‌లో ఉన్నవి. వీటి ధరల్లో ఒక్కోసారి మధ్యాహ్నానికే మార్పులు రావొచ్చు. కాబట్టి స్థానికంగా రేట్లు తెలుసుకోవడం మంచిది.

# కాస్త.. రిటర్న్ చూడు గురూ!



పైసల ముచ్చట్లు

కాలం కన్నా వేగంగా మనిషి జీవితంతో ఆడుకుంటున్న వస్తువు ఏదైనా ఉందంటే.. అది డబ్బే! గుండె కూడా లబ్"డబ్బు' అంటూ నిమిషానికి అరవై కన్నా ఎక్కువసార్లు కొట్టుకుంటుందంటే మనిషికి మనీకి సంబంధం ఎంత స్ట్రాంగో అర్థం చేసుకోవచ్చు. అయితే బతకడానికి డబ్బు కావాలే కానీ, డబ్బే బతుకు కాకూడదు. ఈ సూక్ష్మాన్ని గ్రహించ లేక కొందరు కాసుల వేటలో జీవిత కాలాన్ని కరిగించేసుకుంటారు. ఈ సత్యాన్ని గుర్తించలేక కాణీ సంపాదించకుండా కాలాన్ని భారంగా గడిపేవాళ్లూ ఉంటారు.కానీ, ఈ రెండు వైఖరులూ తప్పే! మన పెట్టుబడి కాలానుగుణంగా వృద్ధి సాధించాలి. అందుకు ఏం చేయాలో? ఈ కొత్త సంవత్సరంలో ఎలా ముందుకు వెళ్లాలో తెలుసుకుందాం.. మనిషి సంపాదనకు గ్యారెంటీ లేదు. జీతభత్యాలు, వ్యాపారంలో లాభాలు పెరిగినంత కాలం ఏ ఇబ్బందీ ఉండదు. కానీ, పరిస్థితులు తారుమారైనప్పుడే డబ్బు విలువ తెలుస్తుంది. రూపాయిని కంటిపాప కన్నా జాగ్రత్తగా చూసుకుంటూ విలువైన జీవితాన్ని కోల్పోతున్నవారు ఎందరో ఉన్నారు. ఎంత కూడబెట్టినా.. ఇంకా ఇంకా సంపాదించాలని పరుగులు తీస్తుంటారు. రాబడి కోసం జీవితాన్ని త్యాగం చేసుకోవద్దు. మనం సంపాదించిన రూపాయి మన కోసం పనిచేసేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. అంటే.. మనం పొదుపు, మదుపు చేసిన రూపాయి.. మన జీవితాన్ని కుదుపులకు గురికాకుండా అదుపు చేయగలగాలి. అలా జరగాలంటే దీర్ఘకాలిక ప్రయోజనాలను ఆశించి ఇన్వెస్ట్‌మెంట్ చేయాలి. అంతేకానీ, క్విక్‌మనీ రేస్‌లో అదృష్టం పరీక్షించుకుంటానంటే కుదరదు.

## ద్రవ్యోల్బణం కొలమానం

రాబోయే లాభాలను దృష్టిలో ఉంచుకొనే ఇన్వెస్ట్ చేస్తారు. నష్టాలు వస్తాయని చెబితే ఎవరూ ఇన్వెస్ట్ చేయరు కదా! లాభం వస్తుందని నమ్మకం ఉంటేనే ముందుకొస్తారు. కానీ, ఆ రిటర్న్ ఎంతన్నది ప్రధానం. మనదేశంలో ద్రవ్యోల్బణం సుమారు ఏడు శాతంగా ఉంటున్నది. అంటే నిత్యావసరాల ధరల్లో ఏటా ఏడు శాతం పెరుగుదల కనిపిస్తుందన్నమాట! ఇంకా చెప్పాలంటే మన ఖర్చులు ప్రతి సంవత్సరం రమారమి ఏడు శాతం పెరుగుతాయి. ఈ మేరకు మన పెట్టుబడిపై వచ్చే రిటర్న్ ఏడు శాతంగానే ఉందనుకోండి.. అప్పుడు మీకు వచ్చే లాభశాతం సున్నా! ద్రవ్యోల్బణం కన్నా తక్కువ శాతం రిటర్న్ వచ్చే ఇన్వెస్ట్‌మెంట్ వల్ల మీ డబ్బు కరిగిపోతుంది తప్ప.. పెరగదు. అందుకే, మన ఇన్వెస్ట్‌మెంట్‌పై వచ్చే రిటర్న్ ఏడు శాతం కన్నా ఎక్కువగా ఉన్నప్పుడే అది మేలైన పెట్టుబడి అవుతుంది. అప్పుడే మీ రూపాయి మరో రూపాయిని సంపాదిస్తున్నట్టుగా భావించాలి. దీర్ఘకాలం పెట్టుబడి అయితే మ్యూచువల్ ఫండ్స్ మంచి ఎంపిక. కనీసం 14 శాతం రిటర్న్ ఇక్కడ పొందే వెసులుబాటు ఉంటుంది. అపార్ట్‌మెంట్ ఫ్లాట్ మీద ఇన్వెస్ట్ చేసినా మంచిదే! ప్రతినెలా అద్దె రూపంలో ఆదాయం వస్తుంది! నెలవారీగా ఎలాంటి ఆదాయాన్ని ఇవ్వని స్థలం కన్నా అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ తీసుకోవడం మంచి పద్ధతి. బంగారం మీద ఇన్వెస్ట్‌మెంట్ కూడా 12 శాతం వరకు రిటర్న్ ఇస్తుంది. అయితే బంగారాన్ని బిస్కెట్ రూపంలో, బాండ్ రూపంలో కాకుండా.. ఆభరణాల రూపంలో కొనుగోలు చేయడం అవసరం. ఆ నగలను మీ ఇంట్లోవాళ్లు ధరించినప్పుడు వాళ్లు పొందే ఆనందాన్ని వెలకట్టలేం కదా! ఇలా రకరకాల రూపంలో ఇన్వెస్ట్ చేసి లాభాలు ఆర్జించొచ్చు.

## బీమా తర్వాతే ఏదైనా..

మీ జీవన సౌధానికి హెల్త్ ఇన్సూరెన్స్ పిల్లర్స్ లాంటివి. ఆ తర్వాత మీరు చేసే పెట్టుబడులు స్లాబుల్లాంటివి. పిల్లర్స్ లేకుండా ఎన్ని అంతస్తులు కడితే మాత్రం ఏం ప్రయోజనం? ఒక్క కుదుపుతోనే మీ జీవితం కుప్పకూలిపోతుంది. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి, మధ్యతరగతి, సగటు ఉద్యోగి అందరూ ఆరోగ్య బీమా కాన్సెప్ట్‌ను లోతుగా అర్థం చేసుకోవాలి. పాతికేండ్ల తర్వాత వైద్యానికయ్యే ఖర్చులను అంచనా వేసి.. ఆ మొత్తానికి ఇన్సూరెన్స్ తీసుకోవాలి. ముందుగా హెల్త్ ఇన్సూరెన్స్, తర్వాత కుటుంబ వ్యవహారానికయ్యే ఖర్చులు ఆ తర్వాతే ఇన్వెస్ట్‌మెంట్ గురించి ఆలోచించాలి. లేకపోతే ఊహించని ప్రమాదం జరిగి ఆస్పత్రిపాలైనా, దీర్ఘకాలిక వ్యాధిబారిన పడినా.. మీ కుటుంబం ఆర్థికంగా ఇరవై ఏండ్లు వెనకబడిపోతుందని గుర్తుంచుకోండి. కుటుంబసభ్యులు నలుగురు ఉన్నట్టయితే.. కోటి నుంచి కోటిన్నర రూపాయల హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం అవసరం. ఆరోగ్య బీమా విషయంలో పెద్దగా ఆలోచించి.. ఎక్కువ మొత్తానికి తీసుకుంటే మీ భవిష్యత్తుకు భరోసా ఇచ్చినవారు అవుతారు!

# మార్కెట్లను ముంచిన జీడీపీ



తీవ్ర ఊగిసలాటల మధ్య నష్టపోయిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ నాలుగేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోనున్నదని కేంద్ర ప్రభుత్వం అంచనాలను విడుదల చేయడం మదుపరుల్లో ఆందోళన నెలకొన్నది. తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు చివరకు నష్టాల్లో ముగిశాయి. కార్పొరేట్ల మూడో త్రైమాసికపు ఆర్థిక ఫలితాలు కూడా ప్రారంభంకానుండటం కూడా మదుపరుల్లో ఆందోళన నెలకొన్నది. వీటికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధుల ఉపసంహరణ కొనసాగుతుండటం, రూపాయి మరింత బలహీనపడటం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 50.62 పాయింట్లు కోల్పోయి 78,148.49 వద్ద ముగిసింది. మరోసూచీ నిఫ్టీ 18.95 పాయింట్లు కోల్పోయి 23,688.95 వద్ద నిలిచింది. దేశ ఆర్థిక వ్యవస్థ నెమ్మదించనుండటం, క్యూ3లో కార్పొరేట్లు నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించే అవకాశాలుండటం మార్కెట్లో తీవ్ర ఆటుపోటులకు లోనయ్యాయని, చివర్లో బ్లూచిప్ సంస్థల నుంచి లభించిన మద్దతుతో భారీ నష్టాల నుంచి కోలుకున్నాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. అమెరికా బాండ్ ఈల్డ్‌లు పెరుగుతుండటం, ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలు సన్నగిల్లడం కూడా మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. 30 షేర్ల ఇండెక్స్‌లో అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్‌అండ్‌టీ, సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఎస్బీఐ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. కానీ, టీసీఎస్, రిలయన్స్, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్, మారుతి లాభాల్లో ముగిశాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ 1.12 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.08 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే కన్స్యూమర్ డ్యూరబుల్ 1.86 శాతం నష్టపోగా, క్యాపిటల్ గూడ్స్ 1.34 శాతం, సర్వీసెస్ 1.26 శాతం, పవర్ 1.17 శాతం, యుటిలిటీ రంగ షేర్లు కుదేలవగా..ఎనర్జీ, ఐటీ, ఆయిల్‌అండ్‌గ్యాస్, రియల్టీ, టెక్, ఐటీ రంగ సూచీలు లాభాల్లో ముగిశాయి.

## స్టాండర్డ్ గ్లాస్ ఐపీవో 182 రెట్ల బిడ్డింగ్‌లు

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ ఐపీవోకి అపూర్వ స్పందన లభించింది. సంస్థ జారీ చేసిన షేర్ల కంటే 182.57 రెట్ల అధిక బిడ్డింగ్‌లు దాఖలయ్యాయి. రూ.410 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి సంస్థ జారీ చేసిన 2,08,29,567 షేర్లకుగాను 3,80,27,59,991 షేర్ల బిడ్డింగ్‌లు దాఖలయ్యాయి. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ విభాగం నుంచి అత్యధికంగా 327 రెట్ల సబ్‌స్క్రిప్షన్ కాగా, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ 275 రెట్లు, రిటైల్ విభాగం 64 రెట్లు అధికంగా బిడ్లు వచ్చాయి. సోమవారం ప్రారంభమైన ఈ వాటా విక్రయం బుధవారం ముగిసింది. ఇష్యూ సైజ్ రూ.133-140 మధ్యలో నిర్ణయించింది.

## రూపాయి కకావికలం

రూపాయి కకావికలమైంది. వరుసగా రెండోరోజు బుధవారం ఒకేరోజు 17 పైసలు పడిపోయి చారిత్రక కనిష్ఠ స్థాయి 85.91కి పడిపోయింది. అమెరికా కరెన్సీ డాలర్ మరింత బలోపేతం కావడం, క్రూడాయిల్ ధరలు భగ్గుమండటం వల్లనే రూపాయి భారీగా పతనమైంది.

# 2030 నాటికి 17 కోట్ల కొత్త జాబ్స్ ఫ్యూచర్ జాబ్స్ నివేదికలో



వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ కూడా 'ఫ్యూచర్ జాబ్స్ రిపోర్ట్-2025'లో కీలక విషయాలను ప్రకటించింది. ఈ నేపథ్యంలో 2030 నాటికి 17 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడతాయని తెలిపింది. దీంతోపాటు 9.2 కోట్ల ఉద్యోగాలు కోల్పోవాల్సి రావచ్చని వెల్లడించింది. ఆ వివరాలేంటో ఇక్కడ తెలుసుకుందాం. కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవడంలో భారతీయ కంపెనీలు ప్రపంచాన్ని అధిగమించేందుకు సిద్ధంగా ఉన్నాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ తాజా ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ నివేదిక ప్రకారం భారతీయ కంపెనీలు ఏఐ, రోబోటిక్స్, ఎనర్జీ టెక్నాలజీల వంటి రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.

## ఏ ఉద్యోగాలు హిట్

నివేదిక ప్రకారం 35% భారతీయ కంపెనీలు సెమీకండక్టర్లు, కంప్యూటింగ్ టెక్నాలజీ తమ వ్యాపారాన్ని పూర్తిగా మార్చగలవని విశ్వసిస్తున్నాయి. అయితే ఈ సంఖ్య ప్రపంచవ్యాప్తంగా 20% మాత్రమే. అదేవిధంగా 21% భారతీయ యజమానులు క్వాంటం, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని ముఖ్యమైనవిగా భావిస్తారు, ఇది ప్రపంచంలోని 12%గానే ఉంది. బిగ్ డేటా, మెషీన్ లెర్నింగ్, సైబర్ నిర్వహణ వంటి ఉద్యోగాలు భారతదేశంలో వేగంగా వృద్ధి చెందుతాయని తెలిపింది. ఇవి భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ట్రెండ్‌లకు సరిపోతాయని చెప్పింది. టాలెంట్ కొరతను ఎదుర్కొనేందుకు భారతీయ కంపెనీలు కొత్త పద్ధతులను అవలంబిస్తున్నాయని ప్రస్తావించింది.

## భారతదేశంలో నైపుణ్యాలకు డిమాండ్

67% కంపెనీలు కొత్త, విభిన్న టాలెంట్ పూల్స్‌పై దృష్టి సారిస్తున్నాయి. 30% కంపెనీలు డిగ్రీ షరతును తొలగించి నైపుణ్యాలకు ప్రాధాన్యతనిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ గణాంకాలు వరుసగా 47%, 19%గా ఉన్నాయి. నైపుణ్యాల డిమాండ్‌లో భారతదేశం, అమెరికా అగ్రస్థానంలో ఉన్నాయి. కానీ వ్యత్యాసం ఏమిటంటే అమెరికాలో ప్రజలు దాని అధ్యయనంపై ఆసక్తి చూపుతున్నారు. అయితే భారతదేశంలో కార్పొరేట్ కంపెనీలు తమ ఉద్యోగులకు నేర్పించడానికి పెట్టుబడి పెడుతున్నాయి.

## 2030 నాటికి భారతదేశంలో ఏమి మారుతుంది?

2030 నాటికి డిజిటల్ టెక్నాలజీల విస్తరణ, వాతావరణ చర్యలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారతదేశంలో ఉద్యోగాలను పునర్నిర్మించగలవని నివేదిక సూచిస్తుంది. ఇది కాకుండా భారతదేశ యువత జనాభాకు ప్రధాన సహకారం ఉంటుంది. నివేదిక ప్రకారం రాబోయే సంవత్సరాల్లో ప్రపంచ శ్రామిక శక్తిలో మూడింట రెండు వంతుల మంది భారతదేశం, ఆఫ్రికా వంటి ప్రాంతాల నుంచి ఉంటారు.

## ప్రపంచంలో ఉద్యోగాల పరిస్థితి

నివేదిక ప్రకారం 2030 నాటికి 170 మిలియన్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడతాయి. ఇదే సమయంలో 92 మిలియన్ల ఉద్యోగాలు కూడా కోల్పోతారు. అంటే 78 మిలియన్ల కొత్త ఉద్యోగాలు వచ్చే ఛాన్సుంది. కొత్త ఉద్యోగాలలో రైతులు, డెలివరీ డ్రైవర్లు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు వంటి జాబ్స్ ఉంటాయి. అదే సమయంలో కారణంగా క్యాషియర్, అడ్మిన్ అసిస్టెంట్ వంటి జాబ్స్ తగ్గుతాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఉన్న 40% నైపుణ్యాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని నివేదిక పేర్కొంది. 63% మంది యజమానులు తమ వ్యాపారాన్ని మార్చడానికి ఇదే అతిపెద్ద అడ్డంకిగా భావిస్తున్నారు. ఈ క్రమంలో కొత్త టెక్నాలజీలు, నైపుణ్యాలను అలవర్చుకోవడానికి సిద్ధంగా ఉన్న వారికే భవిష్యత్‌లో ఉద్యోగాలు ఉంటాయని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఈ రేసులో భారత్ చేరడమే కాకుండా అనేక విధాలుగా ముందుందని తెలిపింది.

మనం TELUGU DAILY

శనివారం 19-09-2026

# టిడిపి సీనియర్ నాయకుడు శాంత రాజు మృతదేహానికి నివాళి



**మంత్రాలయం , సెప్టెంబర్ 18,మనం న్యూస్ ;-** మంత్రాలయం మండలం పరిధిలోని బూదూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు శాంత రాజు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి సోదరులు మాజీ సర్పంచ్ రఘునాథ్ రెడ్డి బూదూరు గ్రామానికి చేరుకొని శాంతరాజు భౌతిక గాయానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. శాంతరాజు కుటుంబానికి తెలుగుదేశం పార్టీ, ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి కుటుంబం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. అలాగే అలాగే టిడిపి శాంత రాజు మృతదేహానికి నివాళు లర్పించారు.

## గణపయ్య ను దర్శించుకున్న

# ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



**మంత్రాలయం , సెప్టెంబర్ 18,మనం న్యూస్ ;** వినాయక చవితి సందర్భంగా మంత్రాలయం మండల పరిధిలోని తుంగభద్ర గ్రామంలో ఆదానీ వీల్మార్ ఫ్యాక్టరీ నందు ఏర్పాటు చేసిన గణనాథుడిని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ముందుగా ఎమ్మెల్యే గణపయ్య పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం వినాయక మండప నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి , పూలమాలలు వేసి , తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట వైకాపా సీనియర్ నాయకులు బాబురెడ్డి , పెట్రోల్ బంక్ శీనన్న గణనాథుడిని దర్శించుకొని,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యాజమాన్యం సోమనాథ పాటిల్, అంబారావు తదితరులు పాల్గొన్నారు

# రైతులూ.. ఈ-కేవైసీ మరిచిపోవద్దు!

పంట నమోదు పూర్తయినా.. ఈ-కేవైసీ 40 శాతమే! పీఎం కిసాన్ నిధులకు

ఈ-కేవైసీ తప్పనిసరి. రైతులకు ఏఓ సురేష్ బాబు సూచన



**తుగ్గలి, సెప్టెంబర్ 18 ( ప్రభ మనం న్యూస్):** తుగ్గలి మండలంలో ఇప్పటివరకు సుమారు 65 వేల ఎకరాల్లో పంట నమోదు పూర్తయిందని మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు తెలిపారు. అయితే ఇప్పటివరకు కేవలం 40 శాతం మంది రైతులు మాత్రమే ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారని, మిగిలిన రైతులు వెంటనే ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ పథకం ద్వారా నిధులు పొందుతున్న రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. రైతులు తమ సమీపంలోని సీఎస్సీ కేంద్రాలు లేదా రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్కే) సిబ్బంది ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవచ్చన్నారు. ఈ-కేవైసీ పూర్తి చేయని రైతులకు తదుపరి విడత పీఎం కిసాన్ నిధులు అందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు.

### 1,500 ఎకరాల్లో శనగ సాగుకు సన్నాహాలు

తుగ్గలి మండలంలో సుమారు 1,500 ఎకరాల్లో శనగ పంట సాగు చేసేందుకు విత్తనాల కోసం ఇండెంట్ పెట్టినట్లు వ్యవసాయ అధికారి సురేష్ బాబు వెల్లడించారు. అయితే కనీసం 75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే శనగ పంట సాగు చేయాలని రైతులకు సూచించారు. శనగ సాగు చేసే ప్రతి రైతు పొలం చుట్టూ జొన్నను బార్డర్ పంటగా తప్పనిసరిగా సాగు చేయాలని సూచించారు. దీనివల్ల పంటకు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

### ప్రతి ఇంటా కిచెన్ గార్డెన్

ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రతి రైతు కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకుని, పీఎండీఎస్ విధానాన్ని అమలు చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు సురేష్ బాబు తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

# చిరుధాన్యాలు.. పండ్లు.. ఆకుకూరలు తప్పనిసరి!

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు పోషకాహారంపై అవగాహన




**తుగ్గలి సెప్టెంబర్ 18( ప్రభ మనం న్యూస్):** 9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా పై చింతలకొండ గ్రామంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలను తప్పనిసరిగా చేర్చుకోవాలని, అదేవిధంగా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలను అధికంగా తీసుకోవాలని సూచించారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లులు, చిన్నారుల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని వివరించారు. అలాగే హ్యాండ్‌వాష్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ, భోజనం చేసే ముందు, మరుగుదొడ్డి వినియోగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులతో పాటు అంగన్వాడీ టీచర్, హెల్పర్ తదితరులు పాల్గొన్నారు.

## జొన్నగిరిలో వైసీపీ శ్రేణుల కదలిక

# ఎన్నికలపై నేతల దిశానిర్దేశం





**తుగ్గలి, సెప్టెంబర్ 18 సెప్టెంబర్( ప్రభ మన న్యూస్):** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్‌సీపీ శ్రేణులు గ్రామస్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ సూచించారు. జొన్నగిరి గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నగేష్ అధ్యక్షతన నిర్వహించారు. తుగ్గలి మండలంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక, శ్రీదేవమ్మకు జొన్నగిరి వైసీపీ నాయకులు రఘు, నాగప్ప, పకీరప్ప, లోకనాథ్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, చెక్క శ్రీను, సుంకప్ప తదితరులు ఘనంగా సన్మానం చేశారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రానున్న సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యకర్తలకు ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, పార్టీ శ్రేణులకు అండగా ఉంటామని తెలిపారు. గతంలో తుగ్గలి మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలను వైసీపీ గెలుచుకున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, రానున్న ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం పార్టీ నాయకులు స్థానిక సమస్యలు, ఎన్నికల కార్యాచరణ, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ అట్లా గోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ పులికొండ నాయక్, ఎంపీపీ గౌరవ సలహాదారుడు హనుమంతు, మాజీ జడ్పీటీసీలు జగన్నాథ్‌రెడ్డి, నారాయణ నాయక్, ఉప్పర్లపల్లి ప్రభాకర్‌రెడ్డి, తుగ్గలి మోహన్‌రెడ్డి, రాతన మోహన్‌రెడ్డి, తుగ్గలి చంద్రశేఖర్‌రెడ్డి, టీఎంటీ ఉసేని, చాంద్‌బాషా, అమర్నాథ్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, మధు యాదవ్, ముక్కెళ్ల గిడ్డయ్య, రాఘవరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, రాంపురం గంగాధర్, గోవిందరాజులు, రామాంజనేయులు యాదవ్, సయ్యద్ హుస్సేన్ భాష, గిరిగెట్ల విష్ణువర్ధన్‌రెడ్డి, అమీనాబాద్ రామాంజనేయులు యాదవ్, చెన్నంపల్లి రంజాన్, సుభాన్, సుంకన్న, జనార్దన్‌రెడ్డి, పగిడిరాయి బోడిబండ హనుమంతు, రామాంజనేయులు, కడంకుంట్ల రాజశేఖర్, దిగుచింతలకొండ సురేంద్ర, ఎర్రగుడి నారాయణ, బొల్లంపల్లి శేఖర్‌రెడ్డి, వైజితాండ అశోక్‌నాయక్, ముక్కల చిరంజీవి, వెంకటేష్, గిడ్డయ్య, మునియప్ప, లక్ష్మణస్వామి, మారెళ్ల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మైదుకూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి..!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, మురుగు కాలువలపై ప్రత్యేక దృష్టి

ప్రజలకు చేరువయ్యేలా ప్రభుత్వ కార్యక్రమాలను అమలను అమలు చేయాలి : ఎమ్మెల్యే





**కడప, సెప్టెంబర్ 18,మనం న్యూస్ ;** మైదుకూరు మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధి పురోగతిపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. సమావేశంలో మైదుకూరు మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరాలను కలెక్టర్‌కు అందించారు. తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, పన్నుల వసూళ్లు, పట్టణ ప్రణాళిక, గృహ నిర్మాణ అనుమతులు, పట్టణ పేదల అభివృద్ధి, వివిధ అభివృద్ధి పథకాల కింద చేపడుతున్న పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. మైదుకూరు పట్టణంలో ప్రస్తుతం భూగర్భ జలాల ఆధారంగా తాగునీటి సరఫరా జరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత తాగునీటి వనరుల అభివృద్ధికి చేపడుతున్న చర్యలను కలెక్టర్ పరిశీలించారు. అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న తాగునీటి అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పైపుల ఏర్పాటు, నీటి నిల్వ ట్యాంకుల నిర్మాణం, నీటి శుద్ధి కేంద్రం తదితర పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలో రోజువారీ తాగునీటి అవసరం, ప్రస్తుతం అందుతున్న నీటి పరిమాణం, ఉన్న లోటుపై అధికారులు వివరించారు. ప్రస్తుతం బోరు బావుల ద్వారా 3.65 మిలియన్ లీటర్ల నీరు సరఫరా అవుతుండగా, అవసరానికి తగ్గ నీటి లభ్యత కోసం ప్రత్యామ్నాయ, శాశ్వత వనరులపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.రహదారుల అభివృద్ధి, గుంతల పూడ్చివేత, మురుగు కాలువల నిర్మాణం, వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు ఏర్పడకుండా కాలువల్లో పూడిక తొలగింపు పనులను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మైదుకూరు మున్సిపాలిటీలో వివిధ నిధులతో కొనసాగుతున్న రహదారులు, డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పట్టణ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్ అధికారులకు సూచించారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తడి పొడి చెత్త వేరు చేయడం, చెత్త తరలింపు, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేసి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అన్న క్యాంటీన్ నిర్వహణ, ప్రజలకు అందుతున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, సిబ్బంది సేవలపై ప్రజాభిప్రాయాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవల్లో ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి సరిదిద్దాలని సూచించారు. విద్య, వైద్య ఆరోగ్య శాఖల్లో సేవలను పటిష్టం చేయాలన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల ఖాళీలను పూరించేందుకు చర్యలు చేపట్టాలని, అందుకు సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలని... సంబందిత అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0, స్వచ్ఛ భారత్ మిషన్ తదితర పథకాల కింద చేపడుతున్న పనులను కూడా కలెక్టర్ సమీక్షించారు. నీటి సరఫరా మెరుగుదలతో పాటు చెత్త నిర్వహణ, వ్యర్థాల శుద్ధి, పాత చెత్త తొలగింపు, భూమి పునరుద్ధరణ వంటి పనులు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చేలా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణ అభివృద్ధికి సంబంధించిన వివిధ శాఖల మధ్య అవసరమైన అనుమతులు, భూ సంబంధిత అంశాలు, ఇతర శాఖల సమన్వయంతో పరిష్కరించాల్సిన సమస్యలను అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా అంశాలపై సమన్వయంతో చర్యలు చేపట్టి అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ... మైదుకూరు మున్సిపాలిటీ తోపాటు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరేలా అమలు చేయాల్సిన అవసరం అధికారులపై ఉందన్నారు. నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి అంశాలపై అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగేందుకు ప్రజాప్రతినిధుల తరపున సహకారం అందిస్తామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశాన్ని శాఖలవారీగా సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి వాటి పరిష్కారానికి స్పష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, తహసీల్దార్ రాజ సింహా నరేంద్ర, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సుస్థిర ఆర్థిక వృద్ధికి వ్యూహాత్మక అడుగులు

అమరావతి ఎకనమిక్ రీజియన్‌తో సరికొత్త పారిశ్రామిక స్వరూపం

ఏఈఆర్‌లో ఎన్‌టీఆర్ జిల్లా భాగం కావడం గర్వకారణం

అన్ని రంగాల్లో సామర్థ్యాల సద్వినియోగం అత్యంత కీలకం

క్లస్టర్ ఆధారిత పారిశ్రామిక అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి

ప్రత్యేక వర్క్‌షాప్‌లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ: సెప్టెంబర్ 18,మనం న్యూస్ ;** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు అమరావతి ఎకనమిక్ రీజియన్ (ఏఈఆర్)తో సరికొత్త ఊపు రానుందని.. పారిశ్రామిక రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అమరావతి ఎకనమిక్ రీజియన్‌లో ఎన్‌టీఆర్ జిల్లా భాగం కావడం జిల్లాకు గర్వకారణమని, ఈ అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను మరింత పెంపొందించే దిశగా సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నవ్య రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే కాకుండా, దానిచుట్టూ ఉన్న జిల్లాలను అనుసంధానిస్తూ అమరావతి ఎకనామిక్ రీజియన్ పేరుతో భారీ ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన ప్రణాళికల రూపకల్పనలో భాగంగా మేధోమథన చర్చలు, వర్క్‌షాప్‌లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఏఈఆర్ ప్రణాళికపై జిల్లాస్థాయి భాగస్వామ్య పక్షాలతో వర్క్‌షాప్ జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, సమన్వయ శాఖల అధికారులు హాజరుగా కాగా పీడబ్ల్యూసీ ప్రతినిధి బినయ్ సోరెంగ్.. వికసిత్ భారత్ 2047 తొమ్మిది పిల్లర్స్‌తో పాటు స్వర్ణాంధ్ర విజన్‌లోని శూన్య పేదరికం, నైపుణ్యాభివృద్ధి, అగ్రీ టెక్, డీప్ టెక్ తదితర పది సూత్రాలను వివరించారు. అదే విధంగా జిల్లాలో ఆర్థిక వృద్ధికి ఉన్న కీలక అవకాశాలను వివరించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలు వంటి సంప్రదాయ రంగాలతో పాటు ఐటీ, ఐటీఈఎస్, డిజిటల్ సేవలు వంటి సన్‌రైజ్ రంగాల్లోనూ అధిక వృద్ధికి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలోని వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, రవాణా, వాణిజ్యం, పర్యాటకం తదితర రంగాల్లో ఉన్న అవకాశాలను గుర్తించి, పరస్పర అనుసంధానంతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతలు, వనరులు, నైపుణ్యాలు, మౌలిక వసతులను గుర్తించి వాటికి అనుగుణంగా క్లస్టర్ ఆధారిత పారిశ్రామిక అభివృద్ధి చేపట్టడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని.. ఈ దిశగా ఇప్పటికే దృష్టిసారించినట్లు వివరించారు. స్థానికంగా లభించే వనరులకు విలువను జోడించే పరిశ్రమలను ప్రోత్సహించడం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అవసరమైన సహకారం అందించడం, యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిపెడుతున్నామని.. అమరావతి ఎకనమిక్ రీజియన్ ద్వారా ఏర్పడే అవకాశాలను జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, యువత, మహిళా పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకునేలా అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం అందించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, ప్రైవేటు రంగ భాగస్వామ్యం, స్థానిక వనరుల సమర్థ వినియోగం ద్వారా సుస్థిరమైన, సమగ్ర ఆర్థిక వృద్ధికి బాటలు వేయవచ్చని తద్వారా ఏఈఆర్‌లో కీలక ప్రాంతంగా జిల్లాను నిలబెట్టవచ్చని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, ఏపీఐఐసీ తదితర శాఖల అధికారులతో పాటు పారిశ్రామిక అసోసియేషన్ల ప్రతినిధులు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఇవి రాష్ట్ర స్థాయిలో సమగ్ర ప్రణాళికల రూపకల్పనకు దోహదపడతాయి. కార్యక్రమంలో సీపీవో వై.శ్రీలత, వీఎంసీ చీఫ్ ఇంజనీర్ పి.సత్యకుమారి, వినోద్ (జేఆర్‌టీ టాటా ఇండస్ట్రియల్ ఎస్టేట్), రామచంద్రరావు, పార్థసారథి (ఎంఎస్ఎంఈ అసోసియేషన్), అల్ట్రాటెక్, సెంటిని, శ్రీ భరత్ ల్యాబ్స్ తదితర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

Office adress....EDITED & PUBLISHED AND OWNED BY.EDITOR : V.LINGAMURTHY. PUBLISHED AT : VSAR PUBLICATION VSAR PUBLICATIONS91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006CONTACT NO :9000367833.RNI,APTEL/26/A 3829,E-MAIL.ID prabhamanam@gmail.com